నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: రావల్‌కోల్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందుకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మౌలాలి తెలిపారు. ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు క్రషర్, హిటాచీ సీడ్స్ కంపెనీ ప్రాంతాలకు, మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు రావల్‌కోల్ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

‘ప్రజావాణి’లో 55 ఫిర్యాదులు

సాక్షి,సిటీబ్యూరో: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు 55 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ ఫిర్యాదులను జిల్లా రెవిన్యూ అధికారి హరిప్రియ, జిల్లా న్యాయ అధికారి చంద్రావతికి సమర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

స్వీప్ ద్వారా ఓటరు నమోదు శాతం పెంచుతాం



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సంఘం సూచనలకు అనుగుణంగా స్వీప్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఓటరు నమోదు శాతాన్ని పెంచుతున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్వీప్ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అర్బన్ ఓటరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యాసంస్థలలో ఓటరు నమోదు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాన్స్ జెండర్లు, వృద్ధుల పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్డీఓ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

బోడుప్పల్: బొల్లిగూడ నుంచి చెంగిచర్ల వరకు రూ.1.30 కోట్లతో జరుగుతున్న బీటీరోడ్డు పనులను సోమవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ప్రధాన రహదారులు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. దశలవారీగా మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈనెల 28న బోడుప్పల్‌లో ఐటీమంత్రి శ్రీధర్‌బాబు పర్యటనను పురస్కరించుకుని అభివృద్ధి పనులకు స్థలాన్ని పరిశీలించినట్లు వివరించారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అధికారులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో యూజీడీ పనులు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని త్యాగరాయనగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.30 లక్షలతో కాలనీలో యూజీడీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్‌ఎస్ నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎఫ్‌సీలోని సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులకు సీఐఎస్ఎఫ్ కమాండెంట్ రాహుల్‌సింగ్ గౌతమ్ నివాళులర్పించి, అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. సీఐఎస్ఎఫ్ భద్రతా దళాలతో పాటు పారా మిలటరీ దళాలు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించండి

కుషాయిగూడ: డివిజన్‌లో సమస్యలపై మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌కు అవసరమైన హైమాస్ట్ పోల్స్, కరెంటు పోల్స్‌ను మంజూరు చేయాలని కోరగా.. జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కష్టపడే వారికే సముచిత స్థానం

మల్లాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి సముచిత స్థానం, పదవులు దక్కుతాయని బీఆర్‌ఎస్ అధినేత మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ యువజన నాయకుడు సీహెచ్. సాయికుమార్ మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలి

అల్వాల్: అల్వాల్‌లోని శ్మశానవాటికను సోమవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి అధికారులతో కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్మశానవాటికలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి కనీస చార్జీలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి సూచించారు. మల్లేష్‌గౌడ్, జార్జ్, ప్రేమ్, గిరి, అరుణ్, యాదగిరి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన భూక్రమబద్ధీకరణ

- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణలో జాప్యం
- హెల్ప్ డెస్కుల ఏర్పాటు
- నగర శివారుల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 3.85 లక్షలు
- విచారణ పూర్తయిన దరఖాస్తులు 11 వేలు మాత్రమే



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారుల్లో లే–అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల విచారణ నత్తనడకన కొనసాగుతోంది. దరఖాస్తుదారులకు సంబంధిత సిబ్బంది విచారణకు రావాలని సమాచారం అందించినప్పటికీ ముందుకు రావడం లేదు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పురపాలక సంఘాల అధికారుల అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు, విక్రయించిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు వీలుకల్పించేందుకు గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ. 1000 రుసుముతో ప్లాట్లు, రూ.10 వేల రుసుముతో వెంచర్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్ జారీ ప్రక్రియ మూలకు పడగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల పరిధిలో 3.85 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

- నగర శివారుల్లో అత్యధికంగా పదుల సంఖ్యలో స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేసి, వందల సంఖ్యలో ప్లాట్లు విక్రయించి రూ. లక్షలు దండుకున్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖలు, పురపాలక సంఘాల పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసిన వాటికి అనుమతి లేని కారణంగా మళ్లీ వాటిని తిరిగి అమ్ముకోలేకపోతున్నారు.
- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణ కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పలు శాఖల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన ప్రారంభించారు. ఎల్–1 నుంచి ఎల్–4 వరకు నాలుగు దశల్లో విచారణ కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ పరిధిలో వచ్చిన దరఖాస్తులను హెచ్ఎండీఏ నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), నీటి పారుదల శాఖ ఏఈలు పరిశీలిస్తారు. పురపాలక సంఘాల పరిధిలో మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ప్లాట్లలో ప్రభుత్వ భూమి, చెరువు, కుంట శిఖం, బఫర్ జోన్, స్థానిక అవసరాలకు కేటాయించి ఉంటే అనుమతి నిరాకరిస్తారు. అన్ని సక్రమంగా నాలుగు దశల్లో పరిశీలనలు చేసి అనుమతి జారీ చేస్తారు. నగర శివారుల్లో 3.85 లక్షల దరఖాస్తులు రాగా, క్షేత్ర స్థాయిలో విచారణకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలువురు కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన లేఅవుట్ పత్రాలు, ఈసీ పత్రాలను జత చేయకపోవడంతో ప్లాట్లను గుర్తించలేకపోతున్నారు. కొన్ని ఏరియాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లు కనిపించకుండా పోయాయి. ఇప్పటి వరకు నగర శివారుల్లో 11 వేల దరఖాస్తులను విచారించగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 5 వేల దరఖాస్తులను పరిశీలించినట్లు తెలుస్తోంది.

పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ త్వరగా చేపట్టేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తులకు కావాల్సిన పత్రాలను జత చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అన్ని పత్రాలు తీసుకురావాలని దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవటంతో కలెక్టరేట్‌లతో సహా పురపాలక సంఘాలు, మండలాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు.

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

27 కేంద్రాల్లో పరీక్షకు హాజరైన అభ్యర్థులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గ్రూపు–1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 27 కేంద్రాల్లో సోమవారం ప్రారంభమైన గ్రూప్–1 పరీక్షలకు 17,779 మంది అభ్యర్థులకు గానూ 12 వేల మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. 5,779 మంది అభ్యర్థులు గ్రూపు–1 పరీక్షలకు హాజరుకాలేదు. జిల్లాలోని ఉప్పల్‌లోని స్ఫూర్తి మహిళా డిగ్రీ కాలేజీ, వాగ్దేవి డిగ్రీ కాలేజీ, మేఘా మహిళా డిగ్రీ కాలేజీలలో ఏర్పాటు చేసిన గ్రూపు–1 పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టరు (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాలలో గదులను, సీసీ కెమెరాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జెరాక్స్ షాపులను మూసి ఉంచారా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు కేటాయించిన సిబ్బంది ఫోన్లను కూడా పరీక్ష గదులలోనికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. ప్రతి హాల్‌లో 24 మంది అభ్యర్థులు మాత్రమే ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. జెఎన్‌టీయూ నుంచి కస్టోడియన్లు, పోలీసు బందోబస్తుతో ప్రతిరోజు పరీక్షా పత్రాలను తీసుకురావడం జరుగుతుందన్నారు.



కూకట్‌పల్లిలో రాధికా గుప్తా

గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో భాగంగా కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ ఇంజనీరింగ్, చింతల్‌లోని రెయిన్ బో డిగ్రీ కాలేజీ, దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టరు(లోకల్ బాడీస్) రాధికా గుప్తా పరిశీలించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేశారన్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల డిజిటల్ వాచ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు. దివ్యాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేసామన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాయంత్రాంగం తరఫున అన్నీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

మేడ్చల్‌రూరల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో సోమవారం మాదిగలు సమావేశం నిర్వహించి మాదిగ మహావీర్ సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులు నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ఎల్లేష్, సురేందర్, ప్రధాన కార్యదర్శిగా రఘురాం, సహాయ కార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారులుగా కిరణ్‌కుమార్, అశోక్‌లతో పాటు కమిటీ సభ్యులను, సలహాదారులను ఎన్నుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

కీసర: అనారోగ్య కారణంగా కీసరకు చెందిన పెద్ద మెరుగు నరసింహ్మ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదె రమేష్‌గుప్తా, మెరుగు నరసింహ్మ మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ. 5 వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. పన్నాల బుచ్చిరెడ్డి, జూపల్లి రవీందర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీఐ పరశురాం, డీఐ శ్రీనివాస్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ ఆవరణలో సీఐ పరశురాం, డీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, శేఖర్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలంటూ వినతి



మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కీసర: అహ్మద్‌గూడ గ్రామంలో ఏళ్ల నుంచి ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని ఓ బహుళనిర్మాణ సంస్థ కబ్జాచేసేందుకు యత్నిస్తుందని, సదరు శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం అహ్మద్‌గూడ అఖిల పక్షం నేతలు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు నానునాయక్, గండి భాస్కర్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ.. అహ్మద్‌గూడ ప్రధాన రహదారి సమీపంలో గల శ్మశాన వాటికకు సంబంధించిన స్థలం గుండా ఓ బహుళనిర్మాణ సంస్థ గతంలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనం కోసం రోడ్డును ఏర్పాటు చేసుకొని గేటును సైతం అమర్చరాన్నారు. బహుళ అంతస్తు భవనంలో పనిచేస్తున్న కార్మికులు, శ్మశానవాటిక స్థలంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమస్యను సదరు అపార్టుమెంట్ యజమానుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తమతో గొడవకు దిగుతున్నారని, సమస్యను మాత్రం పరిష్కరించడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు పూర్తి స్థాయిలో శ్మశాన వాటిన స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

హ్యాకథాన్‌లో ఎన్‌ఎన్‌ఆర్‌జీ విద్యార్థుల ప్రతిభ



విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. నర్సాపూర్‌లోని డాక్టర్ బీవీరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అమెరికాకు చెందిన లీహై యూనివర్సిటీ సహకారంతో గ్రాడ్‌రైట్ నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో ఎన్ఎన్ఆర్‌జీ విద్యార్థులు పాల్గొని తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజేతలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి ప్రశంసా పత్రాలను సోమవారం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కే.రామేశ్వరయ్య మాట్లాడుతూ.. కంప్యూటర్ కోర్సులు చేసే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రావణి హ్యాకథాన్‌కు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

నీటి ఎద్దడి లేకుండా కృషి చేయాలి



బిట్స్ పిలానీలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మిహిర్ షా తదితరులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో సోమవారం బిట్స్ పిలానీ, కోయంబత్తూరు అలీఘర్ ముస్లీం విశ్వవిద్యాలయం సహకారంతో పట్టణ నీటి నిర్వహణపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భారత ప్రణాళిక సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ మిహిర్ షా మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌లను నెలకొల్పి నీటి నాణ్యత ప్రమాణాలు పాటించి, ప్రజలకు మంచి నీటిని అందించాలన్నారు. ప్రకృతి దృశ్యాలపై దూరదృష్టి పెట్టి నిపుణులు నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలకు పూనుకోవాలని కోరారు. పట్టణ నీటి నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి నీటి ఎద్దడి లేకుండా కృషి చేయాలని తెలిపారు. అనంతరం పట్టణ నీటి నిర్వహణపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ముఖర్జీ, మనీష్‌శర్మ, శశిధర్, మిథన్‌లాల్ కాసన్, ప్రొఫెసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘వామపక్ష శక్తులు బలపడుతున్నాయి’

ఉప్పల్: ప్రపంచవ్యాప్తంగా వామపక్ష శక్తులు బలపడుతున్నాయని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు అన్నారు. ఆదివారం సీపీఎం ఉప్పల్ సర్కిల్ 5వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఉప్పల్ బీరప్పగడ్డ నుంచి లక్ష్మారెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ కార్యదర్శిగా వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభకు మేకల ఆశోక్‌రెడ్డి, లలిత, వెంకటేశ్వర్లు, ఎండీగౌస్‌లు అధ్యక్షత వహించారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్ర జెండా మార్గమని అభిప్రాయపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు, రైతులు, మహిళలను కలుపుకుని ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొనగా.. సర్కిల్ పరిధిలో 12 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో వైద్య శిబిరం

కుషాయిగూడ: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మనోజ్ రీజియన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ ఇన్నారెడ్డి, సెకండ్ డిస్ట్రిక్ గవర్నర్ క్లెం కృష్ణారెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎస్సైలు సైదయ్య, సందీప్‌కుమార్, వెంకటయ్య, రవికుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌తో పాటు లయన్స్ ప్రతినిధులు మనోజ్‌కుమార్‌యాదవ్, గంగాధర్‌బాబు, దాసరి ప్రసాద్, మండా సురేష్‌కుమార్, జ్యోతిర్మయాచారి, పావనీరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు



కళాశాల వద్ద గ్రూప్-1 పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు



గ్రూప్-1 పరీక్ష సెంటర్ వద్ద కీసర సీఐ ఆధ్వర్యంలో బందోబస్తు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం గ్రూప్–1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గీతాంజలి ఇంజనీరింగ్ సెంటర్‌లో మొత్తం 936 మందికి గాను 521 మంది పరీక్షకు హాజరకాగా, 415 మంది పరీక్షకు హాజరుకాలేదని సెంటర్ అధికారులు తెలిపారు. కీసర సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



వీబీఐటీ కళాశాల వద్ద.. సీపీ సుధీర్‌బాబు, డీసీపీ పద్మజారెడ్డి

గట్టి బందోబస్తు మధ్య గ్రూప్-1 మెయిన్స్ ప్రారంభం

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూపు–1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలో 8 కేంద్రాలు ఏర్పాటు చేసి 4,416 మంది అభ్యర్థులను కేటాయించారు. 3,434 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 982 మంది గైర్హాజరయ్యారు. ప్రిన్సిటన్, మెగా, వీబీఐటీ పరీక్ష కేంద్రాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి సందర్శించారు. ఆయా కేంద్రాల అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు ఏసీపీలు, 6 ఎస్ఐలతో మొత్తం 80 మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు స్థానిక సీఐ పరశురాం తెలిపారు.

వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రూప్-1 అభ్యర్థులకు వసతి



గ్రూపు-1 అభ్యర్థులకు భోజనం వడ్డిస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో వైఎస్సార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులకు వసతితో పాటు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదూర ప్రాంతల నుంచి పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యరుల రాకపోకలు, వసతికి ఇబ్బందులు రావొద్దని వసతి, భోజనం ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.



వీబీఐటీ కళాశాల వద్ద గ్రూపు-1 అభ్యర్థులు

దివ్యాంగుడిని వీల్ చైర్‌లో పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది



మేడ్చల్‌లో..

మేడ్చల్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని జ్ఞానాపూర్‌లో గల హితం (హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) కాలేజీలో పరీక్ష రాసేందుకు వచ్చిన 989 మంది అభ్యర్థుల హాల్ టికెట్లు, ఐడీ కార్డులను నిర్వాహకులు పరిశీలించి ఎక్జామ్ హాల్‌లోకి అనుమతించారు. దివ్యాంగులను వీల్ చైర్ సాయంతో లోపలికి తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో సీఐ సత్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 27 సెంటర్లలో 17 వేల 762 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు.



గుండ్లపోచంపల్లిలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

వృద్ధుడి అదృశ్యం



దశరథ్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి గిర్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. చింతల దశరథ్(68) కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలంగా మతిస్థిమిత్తం సరిగ్గా లేకపోవడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 19న ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమైయ్యాడు. ఈ మేరకు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొంతుకోసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి గొంతు కోసుకుని చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణుపురి కాలనీకి చెందిన చెన్నం శ్రీను (55) గతంలో కూరగాయల దుకాణంలో పనిచేసేవాడు. మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా తరచూ భార్యతో పాటు కొడుకును వేధించేవాడు. ఇద్దరి కొడుకుల్లో ఒకరైన మహేష్ ఇటీవల వివాహం చేసుకొని సప్తగిరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 20న భార్య పనికి వెళ్లగా మరో కుమారుడు ముకేష్ సోదరుడి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో కూరగాయల కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ఇంటి యజమాని 108కి సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు.